
సాక్షి
ఒడిశా
శనివారం | 9 | మార్చి | 2024


శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.2,37,724
బంగారం	52 గ్రాముల 100 మిల్లీ గ్రాములు
వెండి	62 గ్రాములు

– భువనేశ్వర్/పూరీ

మహానదిలో లోహ సర్పాలు లభ్యం


కటక్ జిల్లా బంకి సువర్ణపూర్ ఘాట్ ప్రాంతంలోని మహానది ఘాట్ వద్ద శుక్రవారం 100కు పైగా లోహ సర్పాలు, నంది విగ్రహాలు లభ్యమయ్యాయి. - 8లో


ఘనంగా మహిళా దినోత్సవం

రాష్ట్రవ్యాప్తంగా అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. - 8లో

న్యూస్‌రీల్

అలరించిన సినీ భక్తి గీతాలు


భక్తి గీతాలు ఆలపిస్తున్న గాయకుడు

బరంపురం: స్థానిక డైమాండ్ ట్యాంక్ రోడ్డులో వీరబ్రహ్మేంద్ర స్వామివారి 54వ వార్షిక నవరాత్రి ఉత్సవాలను తెలుగు కళా సాంస్కృతిక సంస్థ చేపడుతున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా స్వామివారి కల్యాణ మండపంలో గురువారం రాత్రి నిర్వహించిన సినీ భక్తి గీతాలు అలరించాయి. బరంపురానికి చెందిన రాగ తరంగిని ఆధ్వర్యంలో గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వీల్‌చైర్లు అందజేత


వీల్‌చైర్లు అందజేస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలో ఉన్నటువంటి స్టేట్ బ్యాంక్ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ కింద 26 వీల్‌చైర్స్‌ను జిల్లా ఆస్పత్రికి చెందేవిధంగా జిల్లా వైద్యాధికారి ప్రఫుల్ల కుమార్ నాందోకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రఫుల్ల కుమార్ నాందో మాట్లాడుతూ సామాజిక సేవలో బ్యాంక్‌లు ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. చైర్లను జిల్లాలోని 7 సమితుల్లో వినియోగిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యుడు బ్రజా దాస్, బ్యాంక్ అధికారి నర్సింగ్ పాడీ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి దుర్మరణం


శ్రీకాంత్ (ఫైల్)

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్‌లో ప్రముఖ శైవక్షేత్రమైన దేవగిరి కొండపై నుంచి జారి పడి ఒక యువకుడు దుర్మరణం పాలైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. శివరాత్రి రోజున దర్శనం కోసం కుటుంబంతో వెళ్లిన ఆ యువకుడు శివుని దర్శనం కాకుండానే మృత్యువాతపడ్డాడు. మృతుడు జిల్లాలోని కాసీపూర్ పోలీసుస్టేషన్ పరిధి జుడొఅంబొ గ్రామానికి చెందిన శ్రీకాంత్ గౌడోగా గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. దేవగిరి కొండపై కొలువై ఉన్న పాతాలేశ్వరుని దర్శనం కోసం జిల్లాతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు శివరాత్రి రోజున వస్తుంటారు. దీనిలో భాగంగానే సుమారు 800 అడుగుల ఎత్తులో ఉన్నటువంటి ఏకశిల ఆకారంలో గల కొండపై ఉన్న పాతాలేశ్వర స్వామి దర్శనం కోసం శ్రీకాంత్ గౌడో తన కుటుంబంతో శుక్రవారం ఉదయం వెళ్లాడు. ఉదయం తొమ్మిది గంటలకు కొండపైకి ఎక్కుతున్న సమయంలో కాలుజారి శ్రీకాంత్ కిందకి పడిపోయాడు. దీంతో అక్కడ ఉన్నవారు చికిత్స కోసం సమీపంలోని పీహెచ్‌సీకి తరలించారు. అయితే అక్కడ పరీక్షించిన వైద్యులు శ్రీకాంత్ అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న పోలీసులు పీహెచ్‌సీకీ వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి కేసు నమోదు చేశారు.

తస్మైన కారాయ నమః శివాయ

శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని రాష్ట్రంలోని ప్రధాన శైవ పీఠాలు శివనామ స్మరణతో శుక్రవారం మార్మోగాయి. వేకువజాము నుంచి రాత్రి మహాదీపం దర్శనం వరకు భక్తులంతా ఉపవాసం, జాగారంతో పరమ శివుణ్ణి ధ్యానించారు. హరహర మహాదేవ శంభో శంకర అంటూ ఆ దేవ దేవుడిని మనస్సులో నింపుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్


బరంపురం: నీలకంఠేశ్వర ఆలయంలో శివ లింగానికి పూజలు చేస్తున్న పూజారులు


బరంపురం: గొళంతరలో ప్రత్యేక పూజలు



రాయగడ: గుణుపూర్‌లో ద్వాదశ జ్యోతిర్లింగాల వద్ద ప్రత్యేక పూజలు


రాయగడ: శశిఖాల్‌లో స్వామివారికి అభిషేకాలు


జయపురం: పూజలందుకుంటున్న గుప్తేశ్వరుడు


జయపురం: రామగిరి నుంచి గుప్తేశ్వర్ వస్తున్న భక్తులు


పర్లాకిమిడి: మహేంద్రగిరిలో కుంతీ మందిరం వద్ద భక్తులు


కొరాపుట్: కుటినిపాదర్‌లో అభిషేకాలు నిర్వహిస్తున్న దృశ్యం


భువనేశ్వర్: విద్యుత్ వెలుగుల్లో లింగరాజు దేవస్థానం




జయపురం: రుద్రాక్ష పూజల్లో పాల్గొన్న భక్తులు


మల్కన్‌గిరి: పూజలందుకుంటున్న నందీశ్వరుడు


మల్కన్‌గిరి: కొండపై పూజలందుకుంటున్న మల్లికార్జునుడు


జయపురం: శివ లింగానికి దీపారాధన చేస్తున్న భక్తులు


రాయగడ: కెరడ గ్రామంలో ఏర్పాటు చేసిన శివుడి విగ్రహం

సీట్ల పంపకంలో ఊగిసలాట

- ఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన బీజేడీ నేతలు
- పొత్తు ఖరారు కాలేదు: బీజేపీ

భువనేశ్వర్: పొత్తులో భాగంగా బీజేడీ, బీజేపీల మధ్య సీట్ల పంపకాల చర్చలు కొలిక్కి రానట్లు తెలుస్తోంది. గురువారం సాయంత్రం చార్టర్డ్ ఫ్లైట్‌లో హడావుడిగా ఢిల్లీ వెళ్లిన బీజేడీ నేతలు వీకే పాండియన్, ప్రణబ్ ప్రకాష్ దాస్ శుక్రవారం మధ్యాహ్నం ఒడిశా రాజధాని భువనేశ్వర్ తిరిగి వచ్చారు. అయితే ఢిల్లీ పర్యటన విషయాల్లో పెదవి కదపకుండా దాటవేశారు. ఈ ఇద్దరు నాయకులు స్థానిక బీజేడీ ప్రధాన కార్యాలయం శంఖ భవన్‌కు వెళ్లిపోయారు. అక్కడ దళం కార్యకర్తలను ఉద్దేశించి వీకే పాండియన్ ప్రసంగించారు. ఈ సందర్భంగా కూడా బీజేపీతో సీట్ల సర్దుబాటు విషయాన్ని ప్రస్తావించనట్లు సమాచారం.

ఢిల్లీ పర్యటనకు ప్రాధాన్యం

15 ఏళ్ల తర్వాత బీజేడీ తిరిగి బీజేపీలోకి వస్తుందనే వార్తలపై వచ్చిన ఊహాగానాల దృష్ట్యా పాండియన్, ప్రణబ్ ప్రకాష్ దాస్ ఢిల్లీ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఢిల్లీలో బీజేపీ ఎంపీ, ఒడిశాలో ఆ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి విజయ్ పాల్ సింగ్ తోమర్ సదరన్ అవెన్యూ నివాసంలో బీజేడీకి చెందిన ఇద్దరు నేతలు


పృథ్వీరాజ్ హరిచందన్

కాషాయ పార్టీ కోర్ టీమ్‌తో కలిసి మారథాన్ సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ సమావేశానికి సంబంధించిన వివరాలు ఇంకా తెలియరాలేదు. రాష్ట్ర బీజేపీ ప్రధాన బృందంతో విజయ్ పాల్ సింగ్ తోమర్ ఆధ్వర్యంలో కేంద్ర నాయకులతో సమావేశాలను నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది జరగనున్న ఎన్నికలకు ముందు తీవ్ర ఉత్కంఠ రేపుతున్న బీజేడీ, బీజేపీ రెండు పార్టీల మధ్య పొత్తుపై ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని బీజేపీకి చెందిన పృథ్వీరాజ్ హరిచందన్ మీడియా ప్రతినిధులతో అన్నారు. ఒంటరిగా ఎన్నికల్లో పోటీ చేస్తేనే పార్టీకి మేలు జరుగుతుందని కేంద్ర నేతల ముందు రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ స్పష్టంగా చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయాలన్న రాష్ట్ర నేతల వాదనను కేంద్ర నాయకత్వం అంగీకరిస్తుందని ఆశిస్తున్నామన్నారు. త్వరలో నిర్ణయం వెలువడుతుందని భావిస్తున్నామని, రాబోయే ఎన్నికల్లో బీజేపీ తన సొంత బలంతో పోటీ చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. 85 శాతం అసెంబ్లీ సీట్ల కోసం ప్రాంతీయ పార్టీ బిజూ జనతా దళ్ డిమాండ్‌ను అంగీకరించే పరిస్థితిలో లేనందున బీజేడీతో పొత్తు ఆలోచనను రాష్ట్ర నాయకులు వ్యతిరేకిస్తున్నారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. బీజేడీకి 100కు పైగా అసెంబ్లీ సీట్లు ఇస్తే రాష్ట్రంలో బీజేపీ కథ శాశ్వతంగా ముగిసిపోతుందని వారు వాదిస్తున్నారు. ఈనెల ప్రారంభంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ బీజేడీతో పొత్తు పెట్టుకునే అవకాశాన్ని కొట్టిపారేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో ఒడిశాలోని 147 అసెంబ్లీ స్థానాలు, 21 లోక్‌సభ స్థానాల్లో బీజేపీ ఒంటరిగా పోటీ చేస్తుందని ఈనెల 1న న్యూఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన తర్వాత చెప్పారు. మరుసటి రోజు బీజేపీ రాష్ట్ర ఎన్నికల వ్యవహారాల ఇన్‌చార్జి విజయ్ పాల్ సింగ్ తోమర్ ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు.

ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుపై వ్యతిరేకత

- మంత్రి వేసిన శిలా ఫలకాన్ని విరగ్గొట్టిన గ్రామస్తులు


ప్రాసెసింగ్ యూనిట్ కోసం మంత్రి సరక ప్రారంభించిన శిలాఫలకం


శిలాఫలకాన్ని విరగ్గొడుతున్న మహిళలు

రాయగడ: సుమారు రూ.24.91 కోట్ల వ్యయంతో సదరు సమితి కొత్తపేట వద్ద ఏర్పాటు కానున్న చింతపండు ప్రాసెసింగ్ యూనిట్‌ను వ్యతిరేకిస్తున్న గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. దీనిలో భాగంగా రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక వేసిన శిలా ఫలకాన్ని ఆ ప్రాంత మహిళలు శుక్రవారం విరగ్గొట్టారు. వివరాల్లోకి వెళ్తే.. కొత్తపేట గ్రామంలో సుమారు 6 ఎకరాల ప్రభుత్వ స్థలంలో చింతపండు ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసేందుకు టీడీసీసీ సంస్థ చర్యలు చేపట్టింది. ఈ మేరకు యూనిట్ నిర్మాణానికి సంబంధించి భూమిపూజను గురువారం నిర్వహించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక హాజరయ్యారు. అయితే గత కొన్నేళ్లుగా ఈ స్థలాన్ని గ్రామానికి చెందిన దళితవర్గాల ప్రజలు శ్మశానవాటికగా వినియోగిస్తున్నారు. శ్మశానవాటికలో చింతపండు ప్రాసెసింగ్ యూనిట్ కోసం భూమిపూజ చేశారనే విషయం తెలుసుకున్న గ్రామస్తులు, శుక్రవారం సంఘటన స్థలానికి చేరుకుని శిలా ఫలకాన్ని విరగ్గొట్టి తమ వ్యతిరేకతను తెలియజేశారు. ఇక్కడ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తే తామంతా వినియోగిస్తున్న శ్మశానవాటిక సంగతేమిటని ప్రశ్నించారు. ఆ స్థలంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టినా ఊరుకునేది లేదని తేల్చి చెప్పారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తగు చర్యలు తీసుకోకపోతే రానున్న సార్వత్రిక ఎన్నికలను బహిష్కరించడంతో పాటు ఆందోళన పథంలో నడుస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వ స్థలంలోనే ఏర్పాటు: అధికారులు

ఇది ప్రభుత్వ స్థలం కావడంతో చింతపండు ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు సంబంధించి భూమిపూజ కార్యక్రమం చేపట్టామని సంబంధిత శాఖ అధికారులు అంటున్నారు. ఆరు ఎకరాల స్థలాన్ని కొంతమంది శ్మశానవాటికగా వినియోగిస్తుండగా, మరికొంత స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా వివిధ పంటలు పండిస్తున్నారని వివరించారు. ఏదిఏమైనప్పటికీ ప్రభుత్వ స్థలం స్వాధీనం చేసుకునే విషయంలో తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. శ్మశానవాటిక విషయంలో ప్రభుత్వమే తగు నిర్ణయం తీసుకుంటుందని సమాధానం చెబుతున్నారు.

క్లుప్తంగా

పాత ఆస్పత్రిలో సామగ్రి మాయం

టెక్కలి రూరల్: టెక్కలి పాత జిల్లా ఆస్పత్రిలో ఉన్న సామగ్రిని కొంత మంది యువకులు మాయం చేస్తుండగా స్థానికులు పట్టుకున్నారు. ఆస్పత్రిలో అల్యూమినియం డోర్లు, మరికొన్ని విలువైన సామగ్రిని కొంత మంది యువకులు దొంగిలించి తరలిస్తుండగా స్థానికులు వారిని పట్టుకున్నారు. గత కొద్ది నెలలుగా ఇలా దొంగ తనాలు చేస్తున్నారని స్థానికులు తెలిపారు. అయితే శుక్రవారం దొరికిన దొంగ పోలీసులు వచ్చేలోపే తప్పించుకుని వెళ్లిపోవడం విశేషం.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు



ప్రమాద బాధితులకు సపర్యలు చేస్తున్న స్థానికులు

మందస: మండలంలోని మహేంద్రతనయ-మెళియాపుట్టి రోడ్డులో హంసరాళి గ్రామానికి సమీపంలో శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. టెక్కలి ప్రాంతానికి చెందిన కొంతమంది భక్తులు మ్యాక్సీ క్యాబ్‌లో మహేంద్రగిరుల యాత్ర వెళ్లి తిరిగి వస్తూ.. ఇదే మండలంలోని పాత్తంగిలో గల పాత్తీశ్వరాలయానికి వెళ్తున్నారు. మందస మండలంలోని బుడంబో నుంచి ముగ్గురు వ్యక్తులు కిల్లోయి కొండపై ఉన్న శివాలయానికి దర్శనానికి వెళ్తుండగా, రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో క్యాబ్‌లో గల భక్తులకు స్వల్ప గాయాలు కాగా, ద్విచక్రవాహనంపై వెళ్తున్న సవర రామారావు, సుబ్బమ్మ, నీలమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని ప్రైవేటు వాహనంలో హరిపురం సీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు వైద్యులు రిఫర్ చేశారు. మందస పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి మనిషికి ఆధ్యాత్మికత అవసరం



ఆధ్యాత్మిక ప్రవచనాలు చేస్తున్న స్వాములు

మందస: ప్రతి మనిషికి ఆధ్యాత్మిక చింతన ఎంతో అవసరమని అఖిలాంధ్ర సాధుపరిషత్ ప్రతినిధులు చెప్పారు. మందస మండలంలోని కిల్లోయిలో గల శాంతి ఆశ్రమంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మానవ జన్మ ఉత్తమమైనదని, మాధవసేవ చేస్తూ సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. భక్తిభావంతో ముందుకెళ్లినప్పుడు పాపభీతి పోతుందన్నారు. అనంతరం శాంతి హోమాన్ని నిర్వహించి, భక్తులకు అన్నదానం చేశారు. ఒడిశా, ఆంధ్రా నుంచి వచ్చిన కళాకారులు సంకీర్తనలు, భజనలు చేశారు. కేశవచంద్రదాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాల్లో రావివలస, బొగాబంద, డబారు తదితర ప్రాంతాల నుంచి మాధవానందస్వామి, యోగిని లక్ష్మీబాయి, రామానందస్వామి, బాలకృష్ణదాసు, డాక్టర్ కుమార్‌నాయక్, డాక్టర్ తిరుపతిసాహు, నల్ల నీలకంఠ, రాములు పాత్రో తదితరులు పాల్గొన్నారు.

క్వారీలో జారిపడి కార్మికుడు మృతి



ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన అప్పారావు

టెక్కలి రూరల్: మండలంలోని లింగాలవలస గ్రామ సమీపంలో ఉన్న ఎర్త్ ష్రైన్ గ్రానైట్ క్వారీలో కట్టర్ మేస్త్రీగా పనిచేస్తున్న రవాడ అప్పారావు(44) అనే వ్యక్తి క్వారీలో జారిపడి మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కోటబొమ్మాళి మండలం రేగులపాడు గ్రామానికి చెందిన అప్పారావు పొట్టకూటి కోసం టెక్కలి మండలం లింగాలవలస గ్రామ సమీపంలో ఉన్న ఎర్త్ ష్రైన్ గ్రానైట్ క్వారీలో కట్టర్ మేస్త్రీగా పనిచేస్తున్నారు. శుక్రవారం క్వారీకి వెళ్లి పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి క్వారీ కింద ఉన్న రాయిపై అమాంతం పడిపో యారు. తీవ్ర గాయాలపాలైన అప్పారావును అక్కడున్న వారు టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. గుండెకు బలమైన గాయం కావడంతో ఆయన మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. దీనిపై పోలీ సులకు సమాచారం అందించినా చాలా సమయం వారు రాకపోవడంతో మృతదేహాన్ని ఆస్పత్రిలోనే ఉంచాల్సి వచ్చింది. అనంతరం ఆస్పత్రికి చేరుకు న్న పోలీసులు మృతుని భార్య పుణ్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు సేకరించి కేసు నమోదు చేసినట్లు సీఐ పైడయ్య తెలిపారు. అనంతరం మృతదేహానికి శవపంచనామా నిర్వహించారు. మృతు డికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

లయకారుని దయకోరి



కొరాపుట్: చందాహండిలో దర్శనం చేసుకుంటున్న ఎంపీ రమేష్, జొరిగాం ఎమ్మెల్యే ప్రకాష్ తదితరులు



బరంపురం: రామలింగేశ్వర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



రాయగడ: దర్శనానికి బారులుతీరిన భక్తులు



మల్కన్‌గిరి: కొండపైకి ఎక్కుతున్న భక్తులు



మల్కన్‌గిరి: తోలసాహి శివాలయంలో పూజలందుకుంటున్న పరమ శివుడు

మహా శివరాత్రి సందర్భంగా రాష్ట్రంలోని ఆలయాలు పంచాక్షరి మంత్రంతో మార్మోగాయి. లయకారునికి పాలు, పెరుగు, తేనె, చందనం, నెయ్యి, పానకాల పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు జరిపారు. శుక్రవారం వేకువజాము నుంచే ఆలయాల వద్ద ముక్కంటీశ్వరుడి దర్శనాలు కోసం భక్తులు బారులుతీరారు. రోజంతా ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ఏకాహం భజనలు జరిగాయి. లింగోద్భవ వేళలో రుద్రాభిషేకాలు, విశేష పూజలు జరిపారు. వివిధ ఆలయాల్లో సహస్ర దీపాలంకరణలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీలు పటిష్ట ఏర్పాట్లు చేపట్టారు. – సాక్షి నెట్‌వర్క్



కొరాపుట్: సునాబెడాలోని శివాలయ సేవలో ఉన్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలతో మున్సిపల్ చైర్మన్ రాజేంద్ర పాత్రో



బరంపురం: నీలకంఠేశ్వర ఆలయంలో బారులుతీరిన భక్తులు



జయపురం: రుద్రాక్ష యాగం నిర్వహిస్తున్న పూజారులు



జయపురం: శివాలయంలో దీపారాధన చేస్తున్న భక్తులు



జయపురం: భక్తులకు ప్రసాదం అందజేస్తున్న వైశ్య మహిళలు



జయపురం: గుప్తేశ్వర్‌లో భక్తజనం

ఘనంగా మహిళా దినోత్సవం



పర్లాకిమిడి: మహిళా అటవీ సంరక్షకులతో డీఎఫ్‌ఓ ఆనంద్



జయపురం: విజేతలకు బహుమతులు అందజేస్తున్న జిల్లా జడ్జి మిశ్ర తదితరులు



పర్లాకిమిడి: ప్రతిభ కనబరచిన సూర్యప్రభను సత్కరిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని స్థానిక మహిళా ప్రభుత్వ కళాశాల అధ్యాపకురాలు, ఆకాంక్ష మహిళా సంఘటన్ సలహాదారు డాక్టర్ కల్యాణీ మిశ్రా అన్నారు. స్థానిక ఒడ్డిమంగళి వీధి ఉత్కళ హితేషిణి భవనంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత సంతరించుకున్నా, వారి హక్కులు సగటున అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన సూర్యప్రభ పతి, సీడీపీవో పి.కోమలాంగిని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ సీడీఎం డా.గుణనిధినాయక్ సన్మానించారు. ఆశాలత పాణిగ్రాహి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో మహిళా సంఘటన్ కార్యదర్శి మీనాకుమారీ టోహోలో, స్వర్ణప్రభ పతి, ఆడ్వకేట్ భాగ్యలక్ష్మీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



పర్లాకిమిడి: మాట్లాడుతున్న కల్యాణీ మిశ్ర

జయపురం: మహిళలకు అధికారం, పురుషులతో సమాన హక్కులు, భద్రత, మహిళా సాధికారతే ప్రపంచ మహిళా దినోత్సవ ప్రధాన లక్ష్యమని జిల్లా జడ్జి సత్యనారాయణ మిశ్ర అన్నారు. స్థానిక జిల్లా కోర్టు వివాద సమాధాన కేంద్ర సభాగృహంలో జిల్లా న్యాయసేవా ప్రదీకరణ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు తమ శక్తి, అధికారాలను దేశ వికాశానికి వినియోగించాలని సూచించారు. అనంతరం చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్వతంత్ర విజిలెన్స్ జడ్జి రాజేష్ ఎక్కా, అదనపు జిల్లా జడ్జి, పోక్సో కోర్టు జడ్జి సీహెచ్ బాసుదేవ్ పాత్రో, మహిళా కోర్టు జడ్జి అంజలి మాచ్ ఖండ్ తదితరులు పాల్గొన్నారు.

పర్లాకిమిడి: మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో మహిళా ఫారెస్టు గార్డులను సత్కరించారు. సత్కారం అందుకున్నవారిలో వన రక్షకులు సుమినా గొమాంగో, వర్షారాణి పట్నాయిక్, కవితా కార్జి, సుమిత్రా ప్రధాన్, దమయంతి గొడో, ప్రియాంకా బెహర దొళాయి, ప్రియదర్శిని స్వాయిని ఉన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ అటవీ సంరక్షకులు అరుణ్‌కుమార్ సాహు, దేవగిరి అటవీ రేంజ్ అధికారి పి.వెంకటరమణ, సంతోష్ కుమార్ పారిచ్చా తదితరులు పాల్గొన్నారు.

మహానదిలో లోహ సర్పాలు లభ్యం



మహా నదిలో లభించిన లోహ సర్పాలు, నందులు

భువనేశ్వర్: కటక్ జిల్లా బంకి సువర్ణపూర్ ఘాట్ ప్రాంతంలోని మహానది ఘాట్ వద్ద శుక్రవారం 100కు పైగా లోహ సర్పాలు, నంది విగ్రహాలు లభ్యమయ్యాయి. యాదృచ్ఛికంగా మహా శివరాత్రి పర్వదినం నాడు నదీగర్భంలో ఇవి లభించడం స్థానికులు భక్తిపారవశ్యంలో మునిగారు. కొంతమంది చిన్నారులు నదిలో స్నానం చేస్తుండగా కొన్ని వస్తువులు తగిలాయి. దీంతో నీటి లోతులో పరిశీలించగా లోహ సర్పాలు బయటపడ్డాయి. మత్స్యకారుల సహకారంతో స్థానికులు క్షుణ్ణంగా గాలించి 100కు పైగా విగ్రహాలను వెలికి తీశారు. వీటిలో కొన్ని విగ్రహాలు పురాతనమైనవిగా గుర్తించారు. నదీ గర్భంలో బయట పడిన విగ్రహాలను స్థానిక పంచాయతీ కార్యాలయంలో భద్రపరిచారు. మహా శివరాత్రి నాడు ఈ విగ్రహాలు బయటపడడం విశేషంగా భావించి పెద్ద సంఖ్యలో ప్రజలు తండోప తండాలుగా తరలివచ్చారు. పలువురు మహిళలు విగ్రహాలపై పాలు పోసి పూజలు చేయడం కనిపించింది. స్థానిక పరిపాలన అధికారులు సంఘటన స్థలాన్ని సందర్శించి విగ్రహాలను పరిశీలించారు. గ్రామస్తులు విగ్రహాలను ఆ ప్రాంతంలోని మఠం వద్ద ఉంచాలని అభ్యర్థించారు. నదీ గర్భంలో లభించిన విగ్రహాల పూర్వాపరాలను గుర్తించేందుకు సన్నాహాలు ప్రారంభించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

రెండేళ్ల కూతురిని చంపి తల్లి ఆత్మహత్య



మృతి చెందిన తల్లీకూతుళ్లు

బరంపురం: గంజాం జిల్లాలోని పులసర పోలీసుస్టేషన్ పరిధి సన్నోబొర గ్రామంలో తన రెండేళ్ల కూతురిని చంపి, గర్భిణిగా ఉన్న తల్లి ఆత్మహత్య చేసుకున్న విషాదకర ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఐఐసీ అధికారి కౌసిక్ మఝి తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని బికారి గౌడ భార్య మౌనిక తన రెండేళ్ల కుమార్తెను చంపి, తను కూడా ఆత్మహత్య చేసుకున్నట్లు సందేహిస్తున్నారు. అయితే మౌనిక గౌడ తల్లి బలిమ గౌడ మాత్రం అల్లుడే హత్య చేశాడని ఆరోపించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

లారీని ఢీకొన్న కంటైనర్



ప్రమాదంలో నుజ్జయిన కంటైనర్ క్యాబిన్



కేబిన్‌లో ఇరుక్కున్న వారిని బయటకు తీసేకుందుకు ప్రయత్నిస్తున్న స్థానికులు, ఎస్పీ వాహన సిబ్బంది

నరసన్నపేట: నరసన్నపేట సమీపంలో సత్యవరం ఫ్లై ఓవరు వంతెనపై శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ఉదయం 11 గంటల సమయంలో రాజస్థాన్‌కు చెందిన కంటైనర్ బెంగళూరు నుంచి కోల్‌కతాకు పంచదార లోడుతో వెళ్తోంది. దీని ముందు మరో లారీ ఎలక్ట్రికల్ సామాన్లతో గౌహతీ వెళ్తోంది. లారీని దాటుకుని ముందుకువెళ్లాలనే తాపత్రయంలో కంటైనర్ డ్రైవర్ లారీని ఢీ కొట్టాడు. దీంతో కంటైనర్ క్యాబిన్ మొత్తం నుజ్జునుజ్జయ్యింది. వాహనంలో ఉన్న డ్రైవర్, క్లీనర్లు సోహిల్ ఖాన్, అభిద్ ఖాన్‌లు అందులో ఇరుక్కున్నారు. పోలీసులు వచ్చి స్థానికుల సహకారంతో క్యాబిన్‌లో ఇనుమ రాడ్లు కట్ చేసి ఇరుక్కున్న వారిని తీసి నరసన్నపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. లారీ ఎడమ వైపు భాగమంతా ఊడి పడిపోయింది.

ఎస్పీ మానవత్వం

ప్రమాద సమయంలో అటుగా వెళ్తున్న ఎస్పీ రాధిక వాహనాలను గమనించి తన కారును ఆపి స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చే వరకూ అక్కడే ఉండి క్షతగాత్రులను బయటకు తీసేకుందుకు స్థానికుల సహకారంతో ప్రయత్నించారు. వారు బయటకు వచ్చిన వెంటనే తన వాహనంలో ఆస్పత్రికి తరలించారు. మహిళా దినోత్సవం రోజున ఎస్పీ చూపిన మానవత్వానికి అంతా ముచ్చటపడ్డారు. ప్రమాదంపై నరసన్నపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్‌హెచ్ పెట్రోలింగ్ సిబ్బంది సహకారంతో రోడ్డు పైన ఉన్న వాహనాలను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా క్రమబద్ధీకరించారు.

పొత్తుపై చర్చ జరగలేదు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మన్మోహన్ సామల్



మాట్లాడుతున్న మన్మోహన్ సామల్

భువనేశ్వర్: ఢిల్లీలో జరిగిన పార్టీ సమావేశంలో బీజేపీ, బీజేడీ పొత్తుపై ఎలాంటి చర్చ జరగలేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మన్మోహన్ సామల్ తెలియజేశారు. తాము సొంతంగా ఎన్నికల్లో పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని దేశ రాజధాని ఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన తర్వాత మీడియాకు వెల్లడించారు. బీజేపీ కేంద్ర నాయకులతో సమావేశంలో సంకీర్ణ చర్చలు అజెండాలో లేవని స్పష్టం చేశారు. రాష్ట్రంలో బీజేపీ ఒంటరిగానే పోరాడుతుందన్నారు. కేంద్రం, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఎలా ఏర్పాటు చేయాలనే దానిపై చర్చలు జరిగినట్లు తెలిపారు. దీంతో బీజేడీతో బీజేపీ పొత్తు ఊహాగానాలకు తెర పడింది.

క్లుప్తంగా

కౌంటింగ్ కేంద్రాల పరిశీలన



జొన్నాడ వద్ద గల లెండి ఇంజినీరింగ్ కళాశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

డెంకాడ: ఓట్ల లెక్కింపు కేంద్రాల ఏర్పాటు కోసం వివిధ కళాశాలల భవనాలను కలెక్టర్ నాగలక్ష్మి శుక్రవారం పరిశీలించారు. ఆమె ముందుగా డెంకాడ మండలంలోని లెండి కళాశాలను సందర్శించారు. అక్కడ మ్యాప్‌లను, భవనాలను క్షుణంగా పరిశీలించి కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటుపై ఆర్డీఓ ఎం.వి.సూర్య కళ, లెండి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రమణా రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిబాబు, డాక్టర్ శైలజ తదితరులతో చర్చించారు. ఈ పర్యటనలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

యల్లారమ్మ ఆలయకమిటీ ప్రమాణస్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న ఆలయకమిటీ సభ్యులు

జామి: ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి గాంచిన జామి యల్లారమ్మ ఆలయ నూతన కమిటీ సభ్యులు ఎండోమెంట్ ఈఓ ప్రసాదరావు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా వర్రి గోపి, కమిటీ సభ్యులుగా అల్లు పద్మ, కొత్తలి రమాదేవి, నర్సింగరావు, కొత్తలి లక్ష్మి, కొర్రా సావిత్రి, చిప్పాడ రమణమూర్తి ప్రమాణ స్వీకారం చేసిన వారిలో ఉన్నారు. ఈనెల 16నుంచి మూడురోజుల పాటు జరగనున్న యల్లారమ్మ జాతరకు ప్రతిఒక్కరూ. సహకరించాలని ఆలయట్రస్ట్ సభ్యులు ఈ సందర్భంగా కోరారు.

భక్తిశ్రద్ధలతో శివజయంతి

- ఆకట్టుకున్న సహస్ర లింగ ప్రదర్శన



సత్యడిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ సాయి దేవమణిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే కోలగట్ల

విజయనగరం టౌన్: భగవంతుని ఆరాధన చేయడంతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. మహాశివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో స్థానిక అయోధ్య మైదానంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన శివజయంతి ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని, జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పలువురు మహిళలను సత్కరించారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీలు ఏర్పాటుచేసిన మంచు లింగం, సహస్ర లింగ ప్రదర్శన, ద్వాదశ జ్యోతిర్లింగాలు, దీపారాధనను ప్రజలు చూసి ఆనందపరవశులయ్యారు. నర్తనశాల విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.

ఎన్నికల విధులపై సిబ్బందికి స్పష్టత ఉండాలి

- కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ఎన్నికల షెడ్యూల్ వచ్చేలోగా ప్రతి అధికారి, సిబ్బంది ప్రవర్తన నియమావళిని అవగాహన చేసుకుని ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఎన్నికల రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో జరగనున్న సాధారణ, అసెంబ్లీ ఎన్నికల్లో విధులు కేటాయించిన సిబ్బంది అందరికీ వారు నిర్వర్తించాల్సిన విధులపై స్పష్టమైన అవగాహన ఉండేలా శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఈ మేరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో శుక్రవారం కలెక్టరేట్‌లో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సిబ్బందిని చిన్న గ్రూపులుగా విభజించి వారికి మాస్టర్ ట్రైనీల ద్వారా శిక్షణ ఇచ్చినట్లయితే పూర్తి అవగాహన ఏర్పడుతుందని అభిప్రాయపడ్డారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు కోసం పలు బృందాలను నియమించామని ఆయా బృందాల్లో నియమితులైన వారికి మాస్టర్ ట్రైనీల ద్వారా శిక్షణ ఇచ్చి వారికి పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. త్వరలో ఎన్నికల షెడ్యూల్ విడుదల కానున్న దృష్ట్యా రిటర్నింగ్ అధికారులంతా తమ పరిధిలో పనిచేసే సిబ్బంది అందరినీ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్డీ అనిత, రెవెన్యూ డివిజనల్ అధికారులు ఎంవీసూర్యకళ, ఎ.సాయిశ్రీ, బొడ్డేపల్లి శాంతి, రిటర్నింగ్ అధికారులు ప్రమీలారాణి, ఎన్నికల విభాగం తహసీల్దార్ ప్రభాకరరావు పాల్గొన్నారు.

ఊరటనిచ్చిన వర్షం

భామిని: మండలంలో శుక్రవారం రాత్రి వర్షం కురిసింది. వాతావరణం చల్లపడడంతో ఉదయం ఎండ తీవ్రతతో అల్లాడిన మండల ప్రజలకు ఊరటనిచ్చింది. మహాశివరాత్రి పర్వదినాన కురిసిన వర్షపు జల్లు పూత దశలో ఉన్న జీడి, మామిడి, కూరగాయలు పంటలకు ప్రాణంపోసిందని రైతులు చెబుతున్నారు.

గిరిజన గురుకులాల్లో ప్రవేశాలు

- రెండు ఐటీడీఏల పరిధిలో ఐదో తరగతిలో 560 సీట్ల భర్తీ
- 6,7,8,9 తరగతుల్లో మిగులు సీట్లకు నోటిఫికేషన్
- వచ్చేనెల 10 వరకు దరఖాస్తుల స్వీకరణ
- ఏప్రిల్ 24న ప్రవేశపరీక్ష



సీతంపేటలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాల

సీట్ల వివరాలు ఇలా ఉన్నాయి

పాఠశాల	5 వతరగతి	6వ	7వ	8వ	9వ
సీతంపేట బాలురు	80	16	4	3	11
సీతంపేట బాలికలు	80	01	0	1	0
పెద్దమడి	80	41	5	7	1
బద్రగిరి (బాలురు)	80	4	8	3	3
పి.కోనవలస (బాలురు)	80	5	0	0	3
కొమరాడ	80	1	1	3	2
కురుపాం	80	1	0	1	2
మొత్తం	560	69	18	18	22

అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలి



అర్హులైన ప్రతి విద్యార్థి దరఖాస్తు చేసుకోవాలి. ఆంగ్ల మీడియంలో చదువుకోవడానికి గిరిజన విద్యార్థులకు మంచి అవకాశం. సద్వినియోగం చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ఎంట్రన్స్‌కు బాగా ప్రిపేర్ అయితే సీటు లభిస్తుంది. క్రమశిక్షణతో కూడిన విద్యను అందించనున్నాం. విద్యార్థులకు అన్ని ఆయా గురుకులాల్లో సౌకర్యాలుంటాయి.

ఎ.లిల్లీరాణి, డిప్యూటీఈవో, ఐటీడీఏ, సీతంపేట

సీతంపేట: గిరిజన గురుకులాల్లో 2023–24 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఐదోతరగతిలో పూర్తిస్థాయిలో సీట్ల భర్తీకి, అలాగే 6 నుంచి 9 తరగతుల్లో బ్యాక్‌లాగ్ ఖాళీలు భర్తీ చేయనున్నారు. ఈమేరకు గురుకులం సొసైటీ ఉత్తర్వులు జారీ చేసింది. అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి చేసేందుకు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో పెద్దమడి, సీతంపేట బాలురు, బాలికలు, పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో భద్రగిరి, పి.కోనవలస, కొమరాడ, కురుపాం గురుకుల పాఠశాలలో ఐదోతరగతిలో మొత్తం 560 సీట్లు భర్తీ చేయనున్నారు. ఒక్కో పాఠశాలలో ఉన్న 80 సీట్లకు గాను ఎస్టీకి 78 శాతం, ఓసీకి 2 శాతం, ఎస్సీ 12 శాతం, బీసీ 5 శాతం, ఏఈక్యూ (ఏజెన్సీ ఎంప్లాయికోటా) 3 శాతం సీట్లు కేటాయించారు. 6 నుంచి 9 తరగతుల మిగులు సీట్లు 127లో గిరిజన విద్యార్థులను మాత్రమే ఎంట్రన్స్ పరీక్ష ద్వారా భర్తీ చేయనున్నారు. రాత పరీక్షలో ప్రతిభ కనబర్చిన వారికి సీటు లభించనుంది.

షెడ్యూల్ ఇది...

దరఖాస్తు చేసుకోవడానికి చివరితేదీ: 10.4.2024
హాల్ టిక్కెట్ల డౌన్‌లోడ్: 11.4.2024
ప్రవేశపరీక్ష : 21.4.2024, ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు
మెరిట్ జాబితా తయారీ : 10.5.2024
మెరిట్ జాబితా ప్రదర్శన: 20.5.2024
ఫోన్‌కాల్ ద్వారా సమాచారం పంపించే తేదీ: 22.5.2024

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి..

విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈనెల డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీటీడబ్ల్యూగురుకులం.ఏపీ.జీఓవీ.ఇన్‌లో దరఖాస్తు చేయాలి. వారి తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.లక్షకు మించరాదు. ఐదోతరగతిలో ప్రవేశానికి 4 వతరగతిని ప్రభుత్వ పాఠశాలలు, రికగ్నైజ్ స్కూల్స్‌లో చదివి ఉండాలి.


జపనీస్ భాషపై శిక్షణ

పార్వతీపురం టౌన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ హెచ్‌ఆర్ ఆధ్వర్యంలో ఏఎన్ఎం/జీఎన్ఎం/బీఎస్సీ, నర్సింగ్ చదివిన వారికి జపనీస్ భాషను ఎన్5, ఎన్4, ఎన్3 స్థాయిల్లో నేర్పించి, వారికి జపాన్ దేశంలో నర్సులుగా ఉద్యోగావకాశం కల్పించనున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయి కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జపాన్ దేశంలో పనిచేయడానికి ఆసక్తి కలిగి, 32 సంవత్సరాల లోపు వయసున్న అభ్యర్థులు అర్హులని, శిక్షణ కాలం 6 నెలలు ఉంటుందని, ఈ శిక్షణ నవీస్ హెచ్‌ఆర్ బెంగళూరులో జరుగుతుందని పేర్కొన్నారు. శిక్షణ ఫీజు రూ.3,50,000 అని, పాక్షిక శిక్షణ రుసుము రూ.50,000లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ రూ.25,000లు చెల్లిస్తుందని మిగిలిన రూ. 25,000లు అభ్యర్థి చెల్లించాలన్నారు. ఇంకా మిగిలిన రూ.3,00,000 మూడు విడతలుగా అభ్యర్థి చెల్లిచాల్సి ఉంటుందని తెలియజేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి జపాన్ దేశంలో ఉద్యోగావకాశం కల్పించడానికి కావాల్సిన సదుపాయాలను రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నవీన్స్ హెచ్‌ఆర్ పర్యవేక్షిస్తుందని ఉద్యోగం పొందిన అభ్యర్థి జీతం 1,10,000 నుంచి 1.40,000 వరకు ఉంటుందని తెలియజేశారు. ఆసక్తి కలిగిన వారు వెబ్‌సైట్ హెచ్‌టీటీపీఎస్://డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్/హోం/ఆన్‌లైన్ ప్రోగ్రాంలో రిజిస్ట్రేషన్ వివరాలు నమోదు చేసుకోవాలని పే ర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9676965949 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

జిల్లా స్థాయి ఎడ్ల బండ్ల పోటీలు



పోటీలో పరుగు పెడుతున్న ఎడ్ల బండ్లు



పోటీల్లో దౌడు తీస్తున్న గుర్రం

బొండపల్లి: మండలంలోని కొత్తపాలెం గ్రామంలో మాజీ వైస్ ఎంపీపీ బొడ్డు రాము, సత్యవతిల ఆధ్వర్యంలో కృష్ణమ్మతల్లి మహోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాటం, చెక్క భజనతో పాటు ఆలయం ఆవరణలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. అనంతరం జిల్లా స్థాయి ఎడ్ల బండ్ల పరుగు పోటీతో పాటు,గుర్రపు పందాలు, వాలీబాల్ సంగిడి రాళ్ల పోటీలను ఏర్పాటు చేశారు. విజేతతకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి రూ.10,6,4 వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాలను ముఖ్య అతిథుల చేతులు మీదుగా అందజేశారు. సాయంత్రం ఏర్పాటు చేసిన రేలారే జానపద పాటలతో పాటు, సినీ సంగీత విభావరి ఆకట్టుకున్నాయి.

పదిలో ఉత్తమ మార్కుల కోసం



రామభద్రపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సందేహాలు నివృత్తి చేస్తున్న ఉపాధ్యాయుడు

- ప్రణాళికతో సాధన చేస్తే వందకు వంద మార్కులు సాధ్యం



బూశాయవలస కేజీబీవీ పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న టీచర్

రామభద్రపురం: పదో తరగతి ప్రతి విద్యార్థి జీవితంలో ఎంతో కీలకం. పదిలో సాధించిన మార్కులే ఉన్నత విద్య, ఉద్యోగాల కోణంలో ప్రతి దశలోనూ పరిగణనలోకి తీసుకుంటున్నారు.అందు కోసం విద్యార్థులు మార్చి 18 నుంచి జరగబోయే పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కుల సాధనపై దృష్టి పెట్టాలి. ఈ నేపథ్యంలో ప్రతి సబ్జెక్టుకు సంబంధించి సిలబస్‌ను, పరీక్ష విధానాన్ని అవగాహన చేసుకుని పటిష్టమైన ప్రిపరేషన్‌కు ప్రణాళిక రూపొందించుకోవాలి. జిల్లాలో సుమారు 27 వేల మందికి పైబడి విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలతో పాటు ఇతర విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. దాదాపు అన్ని పాఠశాలల్లో ఇప్పటికే సిలబస్ పూర్తిచేసి ఉత్తమ ఫలితాలు సాధించాలన్న లక్ష్యంతో ఉపాధ్యాయులు కృషిచేస్తున్నారు. విద్యాలయాలు వందశాతం ఉత్తీర్ణత సాధించాలంటే ఉపాధ్యాయులు, పర్యవేక్షణ అధికారులు అదే స్థాయిలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సి ఉంటుందని పలువురు విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రణాళికతో ముందడుగు వేయాల్సి ఉందని పలువురు సబ్జెక్టు నిపుణులు తెలియజే స్తున్నారు.

ఫిజియోథెరపిస్ట్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం అర్బన్: జిల్లాలో రెండు భవిత క్లస్టర్‌లలో ఖాళీగా ఉన్న ఫిజియోథెరపిస్ట్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని డీఈఓ ఎన్.ప్రేమకుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిజియోథెరపి డిగ్రీ (బీపీటీ)/ఎంపీటీ విద్యార్హత ఉన్న స్థానికులు అర్హులవుతారని తెలిపారు. క్యాంపు ఒక్కింటికీ రూ.వెయ్యి చొప్పున నెలకు 12 క్యాంపులు నిర్వహించే విధంగా అవర్స్ బేస్‌గా పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 9, 10 తేదీలలో దరఖాస్తులను 'విజయనగరం.ఎన్ఐసీ.ఐఎన్' వెబ్‌సైట్ ద్వారా పొందుపరచవచ్చని, పూర్తి చేసిన దధరఖాస్తులను జిల్లా కేంద్రంలోని సమగ్ర శిక్ష కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

చిన్న పరిశ్రమలకు ఊతం

- ఉత్పత్తుల కొనుగోలుకు ప్రభుత్వం ప్రణాళిక
- పోర్టల్‌లో నమోదు కాని వాటిపై సర్వే
- మార్కెటింగ్ అవకాశాలకు ప్రోత్సాహం



పరిశ్రమలో పనిచేస్తున్న మహిళా కార్మికులు



డానికాఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్ పరిశ్రమ

పూసపాటిరేగ: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పోర్టల్‌లో నమోదు కాని పరిశ్రమలను గుర్తించడానికి సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు జిల్లాలోని అన్ని మండలాల్లో ఎంఎస్ఎంఈలను గుర్తించడానికి సర్వే ప్రారంభమైంది. అత్యధిక పరిశ్రమలు ఉన్న పూసపాటిరేగ మండలంలో ఆయా సచివాలయాల ఉద్యోగులతో ఇప్పటికే సర్వే ప్రారంభమైంది. చిన్న పరిశ్రమలను పోర్టల్‌లో నమోదు చేయించడం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలతో పాటు మార్కెటింగ్ అవకాశాలు, బ్యాంకుల నుంచి రుణాలు అందించడం, అవకాశాలు అందిపుచ్చుకునే విధంగా తోడ్పాటు కలిగిస్తోంది. తక్కువ వ్యయంతో పరిశ్రమలు నెలకొల్పడానికి ప్రభుత్వమే రాయితీలు ఇస్తుంది. అట్టడుగున ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈనెల 1 నుంచి 20వతేదీ వరకు పోర్టల్‌లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల వివరాలు నమోదు చేయడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది.

ఉత్పత్తుల్లో 25 శాతం కొనుగోలు

ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించడానికి ఆయా పరిశ్రమల్లో తయారయ్యే ఉత్పత్తులను ప్రభుత్వ రంగ సంస్థలు కొనుగోలు చేయడానికి ప్రభుత్వం జీఓ జారీ చేసింది. దీంతో ఎంఎస్ఎంఈల నిర్వహణ సులభతరం కానుంది. పూసపాటిరేగ మండల పరిధిలో డానికాఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్, సబూరి షైవుడ్ పరిశ్రమతో పాటు పోర్టల్‌లో నమోదు కాని కోకోనట్, జీడిపిక్కల పరిశ్రమలు, కిరాణాషాపులు, పౌల్ట్రీఫాంలు ఉన్నాయి. ఆయా సచివాలయాల పరిధిలో గల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పరిశ్రమల వివరాలను గుర్తించి పోర్టల్‌లో నమోదు చేయిస్తున్నారు.

సర్వే చేస్తున్నాం



ఎంఎస్ఎంఈలను గుర్తించి పోర్టల్‌లో నమోదు చేయిస్తున్నాం. పోర్టల్‌లో నమోదు కాని సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమలను గుర్తించడానికి సచివాలయ సిబ్బంది సర్వే చేస్తున్నారు. నమోదు చేసిన పరిశ్రమలకు ప్రభుత్వం రాయితీలు కల్పించనుంది. ఈనెల 1న ప్రారంభమైన సర్వే 20 వతేదీలోపు పూర్తి చేస్తాం.

ఎం.రాధిక, ఎంపీడీఓ పూసపాటిరేగ

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వీరఘట్టం: ఈనెల 3న వీరఘట్టం మండలం రేగులపాడు సీఎస్పీ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన స్థానిక బీసీ కాలనీకి చెందిన దళ్లవలస శంకరరావు(44) శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుని భార్య ఉమమహేశ్వరి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.గోవింద తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. పాలకొండ మండలంలోని పొట్లి గ్రామంలో జరిగిన వివాహానికి తన బంధువు పొన్నాపు శ్రీనివాసరావుతో కలిసి శంకరరావు వెళ్లి తిరిగి వీరఘట్టం వస్తుండగా రేగులపాడు జంక్షన్ వద్ద స్కూటీ అదుపు తప్పి ప్రమాదం జరిగింది. దీంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి అయితే శంకరరావు పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు పిల్లలు గాయత్రి, ఉమేష్ ఉన్నారు.



శంకరరావు(ఫైల్)

ఫిష్ ఆంధ్రాతో నాణ్యమైన పౌష్టికాహారం

- గుమ్మలక్ష్మీపురంలో రూ.20 లక్షలతో యూనిట్ ఏర్పాటు
- వినియోగించుకుంటున్న కస్టమర్లు



ఫిష్ ఆంధ్రా సూపర్ యూనిట్‌లో సముద్ర ఉత్పత్తులు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు



గుమ్మలక్ష్మీపురంలో నెలకొల్పిన ఫిష్ ఆంధ్రా సూపర్ యూనిట్

గుమ్మలక్ష్మీపురం: నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తూ నాణ్యమైన మత్స్య ఉత్పత్తులను వినియోగదారులకు అందించేందుకు ప్రభుత్వం ఫిష్ ఆంధ్రా యూనిట్ల ఏర్పాటుకు ప్రోత్సాహం అందిస్తోంది. అందులో భాగంగానే గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో ఎప్పరిక సరోజినికి రాష్ట్రప్రభుత్వం ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా ఫిష్ ఆంధ్రా సూపర్ యూనిట్‌ను మంజూరు చేసింది. ఈ యూనిట్ విలువ రూ.20 లక్షలు కాగా, 40 శాతం ప్రభుత్వ సబ్సిడీ, 30 శాతం పీఎంఎఫ్ఎంఈ సబ్సిడీతో మత్స్యశాఖ పర్యవేక్షణలో యూనిట్‌ను నెలకొల్పారు. నాణ్యతతో కూడిన అన్ని రకాల లైవ్, ఫ్రెష్ సముద్ర ఉత్పత్తులు ఈ యూనిట్ వద్ద అందుబాటులో ఉంచారు. దీంతో ఈ యూనిట్ వద్ద నాణ్యమైన పౌష్టికాహారం లభిస్తుండడంతో పాటు మరో ఆరుగురికి ఉపాధి దొరుకుతోంది.

ఫిష్ ఆంధ్ర యూనిట్‌లో ఉత్పత్తులు

గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్ర యూనిట్‌లో తాజా సముద్రపు చేపలు, రొయ్యలు, పీతలు, బ్రతికిన చెరువు చేప రకాలు, రొయ్య, బొచ్చు, రాగండి, బంగారు తీగ, కొర్రమీను, మట్టగిడస, అపోలో ఫిష్, బాషాఫిష్, పిల్లెట్స్ మొదలైనవి అనునిత్యం లభిస్తున్నాయి.

సబ్సిడీపై ఫిష్ ఆంధ్రా యూనిట్లు



ఫిష్ ఆంధ్రా యూనిట్లలో ఏ యూనిట్‌ను నెలకొల్పినా ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం, ఫిష్ ఆంధ్రా ప్రాజెక్ట్ ద్వారా జనరల్ కేటగిరికి 40 శాతం సబ్సిడీతో పాటు పీఎంఎఫ్ఎంఈ పథకం ద్వారా మరో 30 శాతం సబ్సిడీని కల్పిస్తారు. యూనిట్ లబ్ధిదారు వాటా కేవలం 10 శాతం కాగా, మరో 20 శాతం బ్యాంకు ద్వారా రుణం సదుపాయం కల్పిస్తారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, వినియోగదారులకు ఆరోగ్య భద్రత కల్పించేందుకు ప్రభుత్వం ఆదేశాల మేరకు ఫిష్ ఆంధ్రా యూనిట్ల ఏర్పాటు, నిర్వహణకు ప్రోత్సాహం అందిస్తున్నాం.

వేముల తిరుపతయ్య, జిల్లా మత్స్య శాఖ అధికారి, పార్వతీపురం మన్యం

సీ ఫుడ్స్‌తో ఆరోగ్యానికి మేలు



చేపలు, పీతలు, రొయ్యలు వంటి సీ ఫుడ్స్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ప్రోటీన్లు, ఒమెగా3, ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్–సి, బి6, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం, సోడియం, పొటాషియం వంటి ఖనిజ లవణాలు ఉంటాయి. కావున వీటిని ఆహారంలో ఉపయోగిచడం వల్ల దంతాలు, ఎముకలు దారుఢ్యంగా ఉంటాయి. నాడీ వ్యవస్థ, గుండెకు బలాన్ని ఇస్తుంది. కంటి చూపును మెరుగుపరుస్తాయి. కాలేయానికి, చర్మానికి కూడా ఎంతో మేలు చేస్తుంది.

ఎం.బుద్ధేశ్వరరావు, తాడికొండ పీహెచ్‌సీ వైద్యాధికారి

ఉపాధి లభించింది



ఉన్న ఊర్లోనే స్వయం ఉపాధి పొందేలా ప్రభుత్వం ఫిష్ ఆంధ్రా సూపర్ యూనిట్ మంజూరు చేయడం సంతోషదాయకం. ఈ యూనిట్ వద్ద నాతో పాటు మరో 6 గురికి ఉపాధి లభిస్తోంది. నాణ్యమైన సముద్ర ఉత్పత్తులు నిత్యం అందుబాటులో ఉండడం వల్ల వ్యాపారం ఆశాజనకంగా సాగుతోంది. పార్వతీపురం, బొబ్బిలి, గరివిడి,పాలకొండ తదితర ప్రాంతాల నుంచి కూడా ఆయా శుభకార్యాల నిమిత్తం ఏకమొత్తంలో ఆర్డర్లు వస్తున్నాయి.

ఎప్పరిక సరోజిని, గుమ్మలక్ష్మీపురం

భక్త తీర్థం



రామతీర్థం రాములోరి ఆలయ ప్రాంగణంలో జాగరణ చేస్తున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: శివరాత్రి పర్వదినాన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం భక్త జనంతో కిటకిటలాడింది. ఆలయ ప్రాంగణం భక్తజన సంద్రంగా మారింది. సాక్షాత్తు శ్రీరాముడే ఇక్కడ శివుని తారక మంత్రం జపించారని విశ్వసించిన భక్తులు, సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చి మరీ రాముడి సన్నిధిలో శివరాత్రి జాగరణ చేశారు. భక్తులు తమ హృదయాల్లో శివకేశవులకు బేధం లేదని చాటారు. శ్రీరామస్వామివారి ఆలయం, ఆలయ క్షేత్ర పాలకుడైన ఉమాసదాశివ ఆలయం, రామకోనేరు, బోడికొండ, గురుభక్తుల కొండ, దుర్గాభైరవ కొండ తదితర ప్రాంతాలన్నీ భక్తజనంతో కిక్కిరిసాయి. విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల నుంచే కాకుండా ఒడిశా రాష్ట్రం నుంచి కూడా భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన మత్స్యకారులు అధిక సంఖ్యలో తరలివచ్చి క్షేత్రంలో సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. దేవస్థాన పరిధిలో చుట్టు పక్కల ఖాళీ ప్రదేశాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసుకొని కాగడాలు వెలిగించి రాత్రంతా శివ జాగరణ చేశారు.

ఉమాసదాశివాలయంలో ప్రత్యేకాభిషేకాలు

ఆలయ క్షేత్ర పాలకుడైన ఉమాసదాశివ ఆలయంలో అర్చకస్వామి మల్లిఖార్జున శర్మ ఆధ్వర్యంలో శుక్రవారం వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. స్వామి సన్నిధిలో మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం వైభవంగా జరిపించారు. 11 రకాల ఫల రసాలు, భస్మ, చందన, హరిద్రా కుంకుమ, సుగంధ ద్రవ్య, నారికేళ జలాలుతో శివుడికి మహాభిషేకాన్ని జరిపించారు. సరిగ్గా రాత్రి 12 గంటలకు లింగోద్భవ సమయంలో మహా లింగోద్భవ సమయంలో స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భస్మ పూజ, అష్టమూర్తి హారతి, త్రయంబిక మంత్ర జపం తదితర కార్యక్రమాలు జరిపించారు.

తొలిరోజు సేవలు భేష్

రామతీర్థం శివరాత్రి మహోత్సవాలకు విచ్చేసిన పోలీసులు, రెవెన్యూ, ఇతర శాఖల సిబ్బందితో పాటు పలు స్వచ్ఛంద సేవాసంస్థలు ప్రతినిధులు తొలిరోజు సేవలందించారు. సతివాడ, కొండవెలగాడ వైద్య సిబ్బంది వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మిమ్స్ వైద్య కళాశాల ఆధ్వర్యంలో వైద్య సేవలు కొనసాగాయి. జాతరలో ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఎస్పీ ఎం.దీపికా పాటిల్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, దేవదాయశాఖ కమిషనర్ రామసత్యనారాయణ శివ కేశవులను దర్శించుకున్నారు.